సాక్షి
నిర్మల్
శుక్రవారం । 12 । ఏప్రిల్ । 2024



ఎర్ర బంగారం.. ఏడిపిస్తోంది!

మంచి దిగుబడి వస్తుందని మిర్చి సాగు చేసిన రైతులకు ఈ ఏడాదీ నిరాశే మిగిలింది. తెగుళ్లు, వర్షాల కారణంగా దిగుబడి గణనీయంగా తగ్గింది. ఇప్పుడు ధర కూడా తగ్గుతోంది. 8లో▸



కొబ్బరి నీళ్లకు డిమాండ్

వేసవికాలంలో మండుతున్న ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు కొబ్బరిబోండాలు తాగేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
35.5 /24.8

వాతావరణం

ఆకాశం కొంతమేర మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు నాలుగైదు డిగ్రీలు తగ్గుతాయి. వేడి, ఉక్కపోత తగ్గుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కూలీలందరికీ పని కల్పించాలి



పనులు పరిశీలిస్తున్న డీఆర్డీవో విజయలక్ష్మి

నర్సాపూర్ (జి): ఉపాధి కూలీలందరికీ పని కల్పించాలని డీఆర్డీవో విజయలక్ష్మి సూచించారు. మండలంలోని నందన్ గ్రామ చెరువులో పూడికతీత పనులను గురువారం పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్న దృష్ట్యా కూలీలు 10:30 లోపు పనులు ముగించుకుని ఇళ్లకు వెళ్లాలని సూచించారు. కూలీలకు సరిపడా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. తగు జాగ్రత్తలు పాటిస్తూ ఉపాధి పనులు చేయాలని తెలిపారు. అనంతరం నర్సరీని సందర్శించి పెరుగుతున్న డ్రాగన్ ఫ్రూట్ మొక్కను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీవో సుగుణ, టెక్నికల్ అసిస్టెంట్లు రవీందర్, సతీశ్, ఫీల్డ్ అసిస్టెంట్ భూమేశ్ పాల్గొన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం, గ్లోబల్ సూపర్ స్పెషాలిటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంసీ.లింగన్న ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పెన్షనర్ల సంఘ భవనంలో ఉదయం 10:30గంటలకు ప్రారంభమయ్యే కంటి వైద్య శిబిరాన్ని పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరంలో కంటి పరీక్షల తర్వాత అవసరమైన వారికి ఆపరేషన్లు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు.

దేవరకోటలో శ్రీరంగనాథ యతీంద్ర పూజలు



ప్రసాదం అందిస్తున్న అహోబిల జీయర్

నిర్మల్‌టౌన్: ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ అహోబిల మఠం 46వ జీయర్ శ్రీరంగనాథ యతీంద్ర మహాదేశికన్ జిల్లా కేంద్రంలోని దేవరకోట శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామిని గురువారం దర్శించుకున్నారు. ఆయన అయోధ్య యాత్ర వెళ్లే క్రమంలో మార్గంమధ్యలో ఈ ఆలయాన్ని సందర్శించారు. మళ్లీ అయోధ్య నుంచి తిరిగి వచ్చే క్రమంలో ఈనెల 28న భక్తులకు అందుబాటులో ఉంటారు. ఇందులో ఆలయ చైర్మన్ ఆమెడ శ్రీధర్, ధర్మకర్తలు, భక్తులు ఉన్నారు.

13న సీపీఎం సమావేశం



మాట్లాడుతున్న నూతన్ కుమార్

నిర్మల్‌చైన్‌గేట్: సీపీఎం నిర్మల్ జిల్లా విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం ఈనెల 13న పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం మాట్లాడారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పి.జ్యోతి, రాష్ట్ర కమిటీ సభ్యుడు, నిర్మల్ జిల్లా ఇన్‌చార్జి అడివయ్య హాజరవుతారని వివరించారు. ఈ సమావేశాల్లో పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించే విధానంపై చర్చించనున్నట్లు తెలిపారు. సకాలంలో కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. సీపీఎం పట్టణ నాయకులు డి.పోశెట్టి, చందుల సాయికిరణ్ పాల్గొన్నారు.

ఈద్ ముబారక్

- జిల్లా అంతటా ఘనంగా రంజాన్ వేడుకలు
- ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



నిర్మల్ ఈద్గా మైదానంలో మాట్లాడుతున్న మతపెద్ద



ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి



బందోబస్తు పరిశీలిస్తున్న ఎస్పీ జానకీషర్మిల



నిర్మల్ ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు



ఈద్గా మైదానంలో ప్రార్థన చేస్తున్న చిన్నారులు

ముస్లింల అతిపెద్ద పండుగ రంజాన్‌ను జిల్లా అంతటా గురువారం ఘనంగా జరుపుకున్నారు. వేకువ జామునే పిల్లలు పెద్దలు కొత్త బట్టలు ధరించి ఈద్గాల వద్దకు చేరుకున్నారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. మత పెద్దలు ఖురాన్‌ను చదివి అల్లా బోధనలు వినిపించారు. అనంతరం అందరూ పరస్పరం ఆలింగనం చేసుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నిర్మల్ ఈద్గాంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో వేలాది మంది ముస్లింలు పాల్గొన్నారు. స్థలం చాలకపోవడంతో చాలా మంది రోడ్డు వరకు కూర్చుని నమాజ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ ప్రార్థన అనంతరం ముస్లింలను కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ పండుగ ప్రజలలో సుఖశాంతులు నింపాలని ఆకాంక్షించారు. ఆమె వెంట నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, మాజీ చైర్మన్ అప్పాల గణేశ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అర్జుమాంద్ అలీ తదితరులు ఉన్నారు. రంజాన్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ సమస్య రాకుండా చర్యలు తీసుకున్నారు. ఎస్పీ డాక్టర్ జానకీషర్మిల బందోబస్తును పర్యవేక్షించారు ఆమె వెంట డీఎస్పీ గంగారెడ్డి, పట్టణ సీఐ అనిల్, రూరల్ సీఐ నవీన్‌కుమార్ తదితరులు ఉన్నారు. - నిర్మల్ టౌన్

ఇంకని జలం.. మేల్కోవాలి జనం

- జాడలేని ఇంటికో ఇంకుడు గుంత
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- కానరాని ముందుచూపు చర్యలు
- జిల్లాలోనూ తప్పని నీటి తిప్పలు
- మేల్కోకుంటే మరో 'బెంగ'ళూరే!



జిల్లాలో నిర్మిస్తున్న ఇంకుడుగుంతను చూపుతున్న డీఆర్డీవో విజయలక్ష్మి

నిర్మల్: బెంగళూరు.. దేశ ఐటీ రాజధాని. అన్నిరంగాల్లో అభివృద్ధిలో దూసుకుపోతోంది. అలాంటి మహానగరం ఇప్పుడు మంచినీటి కోసం అల్లాడుతోంది. కనీసం వాటర్ బాటిల్స్ కొందామన్నా సమీపంలో దొరకని దుస్థితి. కిలోమీటర్ల దూరం నుంచి, రూ.వేలు చెల్లించి ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించుకోవాల్సి వస్తోంది. హైదరాబాద్‌లోనూ దాదాపు ఇలాంటి పరిస్థితే. ఇలా ఎందుకు అంటే.. మహానగరాల్లో నేల కనిపించకపోవడమే. ఎటుచూసినా సిమెంటు రోడ్లు, కనీసం వాకిలి లేకుండానే ఇళ్లు కట్టేస్తున్నారు. ఇక ఆకాశం నుంచి వచ్చిన నీటిచుక్క నేలలో ఇంకితేనే కదా.. బోర్లు, బావుల్లోకి నీరు చేరేది. మళ్లీ నీళ్లు వచ్చేది. ఇంటికో ఇంకుడుగుంత ఉండాలి. కానీ.. దాన్ని పట్టించుకోవడమే లేదు. ఈ నిర్లక్ష్యమే ఇప్పుడు మహానగరాలను గుక్కెడు నీటి కోసం అల్లాడేలా చేస్తోంది. ఇదే పరిస్థితి రేపోమాపో మన ఊళ్లల్లోనూ వచ్చేలా ఉంది.

ముందుచూపేది..?

జిల్లాలో ఓవైపు జలాశయాలు ఖాళీ అవుతున్నాయి. మరోవైపు భూగర్భజలాలూ అడుగంటి పోతున్నాయి. కనుచూపు మేరలోనే కరువుచాయలు కనిపిస్తున్నాయి. ఇందుకు పాలకులు, అధికారుల్లో ముందుచూపు లేకపోవడమే కారణమన్న వాదనలు వస్తున్నాయి. సాగుకే కాదు.. తాగునీటికీ జిల్లాలోని చాలా గ్రామాలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బోరుబావులు చాలావరకు ఎత్తిపోతున్నాయి. ఇంటికో ఇంకుడుగుంత నిర్మించాలని ఉన్నా.. కనీసం పట్టించుకోవడం లేదు. ఏళ్లుగా నీటిని ఒడిసిపట్టకపోవడంతోనే ఇప్పుడు కరువు తరుముకొస్తోంది.

ఇంటికో ఇంకుడుగుంతెక్కడ..!

ప్రతీ ఇంటికో ఇంకుడుగుంత ఉండాలి. కొత్త ఇల్లు నిర్మాణానికి పర్మిషన్ తీసుకునేటప్పుడే ఇంకుడు గుంత నిర్మాణం తప్పనిసరిగా ఉంటుంది. ఇది చట్టాల్లో పక్కాగా ఉంది కానీ.. ఎక్కడా ఇది అమలు కావడం లేదు. సంబంధిత అధికారులూ పట్టించుకోవడం లేదు. కేంద్ర ప్రభుత్వం చాలా ఏళ్లుగా ఇంకుడుగుంతల నిర్మాణం, వాననీటిని ఒడిసిపట్టుకోవాలన్న అంశాలపై ప్రచారం చేస్తూనే ఉంది. కానీ క్షేత్రస్థాయిలో నామమాత్రంగానే అమలవుతోంది. మున్సిపాలిటీలలో సైతం ఇంకుడు గుంతల నిర్మాణం కనిపించడం లేదు. ఇంటికో బోరు వేసుకుంటున్నారు కానీ.. ఆ బోరుబావిని రీచార్జ్ చేసే విధానంపై మాత్రం దృష్టిపెట్టడం లేదు.

రికార్డుస్థాయిలో..

భూగర్భజలాల కోసం కేంద్ర ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను చేపడుతోంది. ఇందులో భాగంగా 'క్యాచ్ ది రెయిన్' పేరిట అవగాహన కార్యక్రమాన్ని చేస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో గత ఏడాది రికార్డుస్థాయిలో 5,940 ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టారు. కానీ ఇవన్నీ.. ప్రభుత్వ కార్యాలయాల్లోనే నిర్మించారు. ఇదొక అవగాహన కార్యక్రమంగా డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ ఏడాది కూడా క్యాచ్ దిరెయిన్ పేరిట కార్యక్రమంలో భాగంగా బోరువెల్ రీచార్జ్ గుంతలను నిర్మిస్తున్నారు. కానీ.. వీటి ఉద్దేశం అందరికీ చేరడం లేదు. అనుకున్న లక్ష్యాన్ని సాధించడం లేదు. అందుకే తరచూ భూగర్భ జలాల సమస్య వస్తోంది. జనం మేల్కొంటేనే సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

పడిపోతున్న పాతాళగంగ..

జిల్లాలో గతనెలకు ఈనెలకే ఒకమీటర్ లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. మార్చిలో 9.01 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉండగా, ఏప్రిల్ కు వచ్చేసరికి 10.19 మీటర్ల లోతుకు పడిపోయాయి. ప్రస్తుతం వ్యవసాయ పనులు కొనసాగుతుండటం, వేసవి కావడంతో రోజురోజుకూ నీటి వినియోగం పెరుగుతుండటమూ ఇందుకు కారణంగా చెప్పవచ్చు. జిల్లాలో మిగితాచోట్లతో పోలిస్తే ముధోల్ నియోజకవర్గంలోని కుంటాల, తానూరు, భైంసా, ముధోల్, బాసర, కుబీర్ తదితర మండలాల్లో భూగర్భజలాల లభ్యత కష్టంగా మారుతోంది.

'రీచార్జ్' చేస్తేనే కదా..

సెల్‌ఫోన్‌లో బ్యాలెన్స్ అయిపోతే ఎలాగైతే వెంటనే రీచార్జ్ చేస్తామో.. భూగర్భజలాలు ఇంకిపోకుండా ఉండటానికీ 'రీచార్జ్' అవసరమే. ఇందుకు ప్రతీఇంట్లో రెండురకాల ఇంకుడుగుంతలను నిర్మించుకోవాలి. ఇంట్లో బట్టలు ఉతకడానికి, వంటపాత్రలు కడగటానికి, స్నానదుల్లో ఉపయోగించిన నీరు భూమిలోకి వెళ్లడానికి 'సోక్‌పిట్' నిర్మించుకోవాలి. ఇక వర్షాకాలంలో వర్షపునీరు వృథాగా పోకుండా ఉండేందుకు బోర్లు, బావులకు దగ్గరగా 'రీచార్జ్‌పిట్'ను ఏర్పాటు చేసుకోవాలి. ఈ రెండు గుంతలు ప్రతీఇంట్లో ఉంటే చాలావరకు భూగర్భజలాల సమస్య రాదని భూగర్భజలాల శాఖాధికారులు చెబుతున్నారు.

నీటిని కాపాడుకోవాలి..



ప్రతీ నీటిచుక్క విలువైనదే. మనకు జలవనరులు అందుబాటులో ఉన్నాయని విరివిగా వినియోగిస్తే వాటి కొరత ఉన్నప్పుడు విలువ తెలుస్తుంది. ప్రతీ ఇంట్లో సోక్‌పిట్, రీచార్జ్‌పిట్ నిర్మించుకుని, భూగర్భజలాలను కాపాడుకోవాలి.

– శ్రీనివాసరావు, డిప్యూటీడైరెక్టర్, భూగర్భజలశాఖ

ఇంకుడుగుంతలపై అవగాహన..



జిల్లాలో ఇంకుడుగుంతల నిర్మాణాలపై కలెక్టర్ ఆదేశాల మేరకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. గతేడాది రికార్డుస్థాయిలో ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్మించాం. ఈఏడాది కొనసాగిస్తున్నాం. ఓపెన్ బావుల పునరుద్ధరణ పనులు చేపడుతున్నాం. జిల్లావాసులు తమ ఇళ్లల్లోనూ ఇంకుడుగుంతల నిర్మాణానికి ముందుకు రావాలి. – విజయలక్ష్మి, డీఆర్డీవో

బీఆర్ఎస్ ఖాళీ కావడం ఖాయం

- డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు
- కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కాంగ్రెస్‌లో చేరిన వారితో శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్/సోన్: కాంగ్రెస్ గాలికి నిర్మల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఖాళీ కావడం ఖాయమని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. సోన్ మండలానికి చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు గురువారం ఆ పార్టీలకు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. వారికి శ్రీహరిరావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పేదలకు అందేలా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతోపాటు రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో విజయఢంకా మోగించేలా పని చేయాలని సూచించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో బీఆర్ఎస్ సోన్ మండల అధ్యక్షుడు మొహినుద్దీన్‌తో పాటు వివిధ గ్రామాల మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు మధుకర్‌రెడ్డి, రాజనర్సింహారెడ్డి, బర్మదాసు, శ్రీనివాస్‌గౌడ్, లింగన్న, శివరాం, సహారా భాను, గడ్పంద పోశెట్టి, మౌలానా, విలాస్, తోకల మల్లయ్య, దేశెట్టి భాస్కర్, వేంపల్లి ప్రవీణ్, అర్జున లింగన్న, రామచందర్ రెడ్డి, వెంకట నరసయ్య, నాంపల్లి ప్రభాకర్, గంట మహేందర్, సీహెచ్.శ్రీధర్, గుండారం స్వామి, పసుపుల రాజేశ్వర్, చౌటుపల్లి మహేందర్, దర్శనం సుధాకర్, బాస పెద్ద ముత్తన్న, సర్వేష్ ఉన్నారు.

13న బూత్ స్థాయి సమ్మేళనం

నిర్మల్‌చైన్‌గేట్: ఈ నెల 13న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో బీజేపీ బూత్ స్థాయి నేతల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజు కుమార్ రెడ్డి తెలిపారు. ఈ సమ్మేళనానికి నిర్మల్ జిల్లాలోని ప్రతీ బూత్ అధ్యక్షులు, కోఆర్డినేటర్లు, బీఎల్ఏలు, ఆపై స్థాయి నాయకులు, మండల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

సరస్వతి కెనాల్‌కు నీటి విడుదల



సరస్వతి కాలువకు నీటిని విడుదల చేయిస్తున్న రైతులు, నాయకులు

- ఎమ్మెల్యేలకు రైతుల కృతజ్ఞతలు

లక్ష్మణచాంద: సరస్వతి కాలువ ఆయకట్టుకు గురువారం నీటిని విడుదల చేశారు. వారం రోజులుగా కాలువ ద్వారా నీటి విడుదల ఆగిపోవడంతో పొట్టదశలో ఉన్న పంటలను ఎలా కాపాడుకోవాలో తెలియక రైతులు ఆందోళన చెందారు. సమస్యను నిర్మల్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, వెడ్మ బొజ్జుతోపాటు డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యేలు, డీసీసీ చీఫ్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడి నీటి విడుదలకు ఆదేశాలు జారీ చేయించారు. ఎట్టకేలకు కాలువకే నీటిని విడుదల చేయడంతో సోన్, నిర్మల్ రూరల్, లక్ష్మణచాంద, మామడ, ఖానాపూర్, కడెం, దస్తురాబాద్ మండలాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నీటిని విడుదల చేయించిన ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షుడికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో నాయకులు సరికెల గంగన్న, అడ్వాల రమేశ్, హరీశ్‌రెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు సద్వినియోగం తీసుకోవాలి

నిర్మల్‌చైన్‌గేట్: సరస్వతి కెనాల్, సదర్మాట్ ఆయకట్టు రైతుల కోసం ప్రత్యేకంగా విడుదల చేసిన నీటిని రైతులు సద్వినియోగం చేసుకుని పంటలను కాపాడుకోవాలని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు సూచించారు. జిల్లాలోని సరస్వతి కెనాల్, సదర్మాట్ ఆయకట్టు పంటలను కాపాడేందుకు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నీటిపారుదల శాఖ చీఫ్ సెక్రటరీ రాహుల్ బొజ్జను ప్రత్యేకంగా కలిసి విన్నవించానని తెలిపారు. నీటిని విడుదల చేయాలని కోరారు. స్పందించిన మంత్రి వెంటనే నీటిని విడుదల చేశారని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకుని తమ పంటలను కాపాడుకోవాలని సూచించారు. రైతులకు నీటి ని విడుదల చేయించడంలో ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి పాత్ర ఏమీ లేదని పేర్కొన్నారు.

ఘనంగా జ్యోతిబాపూలే జయంతి



పూలేకు నివాళులర్పిస్తున్న కలెక్టరేట్ సిబ్బంది



పూలే జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే బొజ్జు

నిర్మల్‌చైన్‌గేట్: సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిబాపులే జయంతిని కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం పూలే చేసిన కృషిని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రాజేశ్వర్ వివరించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి

ఖానాపూర్: మహాత్మ జ్యోతిపూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహం ఎదుట అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో గురువారం పూలే జయంతి నిర్వహించారు. ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. జ్ఞానం అజ్ఞానాన్ని చీల్చి విజ్ఞానం వైపు అడుగులు వేస్తుందని సత్యశోధక్ సంస్థను స్థాపించి అణగారిన వర్గాలను విద్యవైపు అడుగులు వేయించిన గొప్ప దార్శనికుడు జ్యోతిబాపులే అని పేర్కొన్నారు. కార్యక్రమంలో చిన్నం సత్యం, కావలి సంతోష్, మేస సతీశ్, మునుగూరి నవీన్, నేత శ్యామ్, జన్నారపు శంకర్, ద్యావతి రాజేశ్వర్, అంబేద్కర్, రాసమల్ల అశోక్, ప్రణీత్, గోవింద్, తిరుమలేశ్, రాజ్‌కుమార్, గొర్రె గంగాధర్, త్రివేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో..



పూలేకు నివాళులర్పిస్తున్న కృష్ణంరాజు

నిర్మల్‌టౌన్: మహాత్మ జ్యోతిబాపూలే జయంతిని జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఉప్పు కృష్ణంరాజు మాట్లాడుతూ.. భారతదేశంలో బడుగు బలహీనవర్గాలకు చెందిన ప్రజలు ఆయన కృషితోనే అన్నిరంగాల్లో ముందుకు సాగుతున్నారన్నారు. కార్యక్రమంలో కన్వీనర్లు సిరికొండ రమేశ్, కత్రోజ్ అశోక్, కొట్టూరి కిషన్, కార్యనిర్వహణ అధ్యక్షుడు జీవన్, ఏంబడి చంద్రశేఖర్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు



మాట్లాడుతున్న సీఐ సాయినాథ్

బేల: మండలంలోని సాంగి(జి) నుంచి ఆదిలాబాద్ వైపు గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు జైనథ్ సర్కిల్ సీఐ సాయినాథ్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాంగ్వి(జి) గ్రామానికి చెందిన పొచ్చిరాం బుధవారం సాయంత్రం 7 కిలోల గంజాయి తీసుకెళ్తుండగా ముందస్తు సమాచారం మేరకు ఎస్సై రాధికతో పాటు సిబ్బంది పట్టుకున్నారన్నారు. ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి నుంచి విత్తనాలు తెచ్చుకుని తన వ్యవసాయ చేనులో గంజాయి సాగు చేస్తున్నాడని విచారణలో గుర్తించామన్నారు. గంజాయి విలువ రూ.1,75,000 వరకు ఉంటుందన్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

గంజాయి పట్టివేత

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని కేఆర్‌కే కాలనీకి వెళ్లే మార్గంలో గురువారం ఇద్దరు వ్యక్తుల వద్ద నుంచి 130 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. అంబాదాస్ (కేఆర్‌కేకాలనీ), సోనేరావు (రుమస్‌కాస, గాదిగూడ)ల వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

గోధుమపిండి వాహనం అడ్డగింత

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఇందిరమ్మ కాంప్లెక్స్ ఏరియాలో గురువారం మహారాష్ట్రకు చెందిన ఆశీర్వాద్ గోధుమపిండి వాహనాన్ని వ్యాపారులు అడ్డుకున్నారు. ఇతర ప్రాంతాల నుంచి అనుమతి లేకుండా గోధుమపిండి వస్తుందన్న సమాచారం మేరకు వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో దాదాపు 200 బ్యాగులు లభ్యమయ్యాయి. పోలీసులకు సమాచారం అందించడంతో వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దు

భైంసారూరల్(ముధోల్): మండలంలోని కామోల్ గ్రామంలో గురువారం విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి చెందింది. గ్రామానికి చెందిన చిన్నారెడ్డి ఎద్దు గ్రామ శివారులోకి మేతకు వెళ్లింది. పంటచేనులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తీగలకు తగలడంతో విద్యుత్ సరఫరా జరిగి మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ.60 వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.



మిర్చి పంటలో పశువులను మేపుతున్న రైతు

ఎర్ర బంగారం.. ఏడిపిస్తోంది!

- తెగుళ్ల కారణంగా తగ్గిన దిగుబడి
- డిమాండ్ లేదని పతన మవుతున్న ధర
- వాతావరణ మార్పులతో మరింత ప్రభావం
- దిక్కుతోచని స్థితిలో మిర్చి రైతులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

కుంటాల: మంచి దిగుబడి వస్తుందని మిర్చి సాగు చేసిన రైతులకు ఈ ఏడాదీ నిరాశే మిగిలింది. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి పంట సాగుచేస్తే తెగుళ్ల, వర్షాల కారణంగా దిగుబడి గణనీయంగా తగ్గింది. దీంతో చాలా మంది రైతులు పంటను చేలల్లోనే దున్నేయగా, మరికొందరు పశువులను మేపుతున్నారు.

పడిపోయిన ధరలు..

ఇదిలా ఉంటే.. అంతర్జాతీయ మార్కెట్లో మిర్చి పంటకు డిమాండ్ లేకపోవడంతో అమాంతంగా ధరలు పడిపోయాయి. నిర్మల్ జిల్లాలో ఈయేడు 560 ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశారు. రెండు మూడు రోజులుగా వాతావరణంలో మార్పులతో మిర్చి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పంట దిగుబడి అంతంత మాత్రంగా ఉందని, ఈ సమయంలో వర్షాలు కురిస్తే కాయలు నల్లబడి ధర మరింత పడిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సీజన్ ప్రారంభంలో క్వింటాల్‌కు రూ.21 వేల నుంచి రూ.22 వేలు ధర పలికిన ఎర్ర బంగారం.. ఇప్పుడు రూ.8 వేల నుంచి రూ.13 వేల వరకు మాత్రమే ఉంది. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

తెగుళ్లతో తగ్గిన దిగుబడి..

ఎన్నో ఆశలతో ఎర్ర బంగారాన్ని సాగు చేసిన రైతులకు ఆది నుంచి కష్టాలు తప్పడం లేదు. పూత, కాత దశలోనే పంటకు ఎండుతెగులు సోకింది. ఎకరాకు 50 నుంచి 60 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా 20 క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇక జిల్లాలో మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో వచ్చిన దిగుబడిని కూడా దళారులకే అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మంచి దిగుబడి వస్తే నాగపూర్ మార్కెట్‌కు తరలించాలనుకున్న రైతులకు తగ్గిన దిగుబడి నిరాశే మిగిల్చింది. ఇక మూడు రోజులుగా వాతావరణంలో మార్పులతో చేతికి వచ్చిన పంటను ఆరబెట్టేందుకు ఇబ్బంది పడుతున్నారు. వర్షాలు కురిస్తే మరింత నష్టపోతామని పేర్కొంటున్నారు. దిగుబడి, ధర తగ్గడంతో తీవ్రంగా నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని మిర్చి రైతులు కోరుతున్నారు.

క్వింటాల్‌కు రూ.8 వేలే..



నాలుగు ఎకరాల్లో మిర్చి పంట సాగుచేశా. పూత, కాత దశలో ఎండు తెగులు సోకింది. పంట దిగుబడి బాగా తగ్గింది. వచ్చిన దిగుబడిని వరంగల్ మార్కెట్‌కు తీసుకెళ్లి క్వింటాల్‌కు రూ.8 వేలకే విక్రయించిన. ఇప్పుడు పంట మొత్తాన్ని దున్నేశా.

– చోటేమియా, రైతు, ఓలా

దిగుబడి తగ్గింది..



మిర్చి సాగుకు ఎకరానికి రూ.1.50 లక్షల పెట్టుబడి పెట్టిన. వాతావరణ పరిస్థితుల కారణంగా ధరలు పడిపోయాయి. కాయలు ఏరినా కూలీలకు కూడా సరిపోయే పరిస్థితి లేదు. చేసేదేమీ లేక పంటలో పశువులను మేపుతున్న. ప్రభుత్వం ఆదుకోవాలి.

– ఎల్లమ్మల శంకర్, రైతు, కుంటాల

అకాల వర్షం.. పంటలకు నష్టం



దెబ్బతిన్న జొన్నపంట చూపుతున్న రైతు ఆనంద్

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లో రెండు రోజులుగా ఈదురుగాలులతో కురుస్తున్న వర్షాలకు యాసంగి సీజన్‌లో సాగు చేసిన పంటలు దెబ్బతిన్నాయి. మండలంలోని పొన్నారి గ్రామానికి చెందిన అండే అశోక్ అనే రైతుకు చెందిన మూడెకరాల జొన్నపంట బుధవారం రాత్రి కురిసిన వర్షానికి నేలకొరిగింది. ఎకరాకు దాదాపుగా 18 క్వింటాళ్ల దిగుబడి వచ్చేదని.. వర్షం కారణంగా పంట నేలకొరగడంతో నల్లబారుతోందని .. దిగుబడి తగ్గుతుందని ఆందోళన చెందుతున్నాడు. మరో రెండు రోజులు వర్షం ఇలాగే కురిస్తే నష్టం తీవ్రత పెరుగుతుందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

అంధకారంలో భీంపూర్ వాసులు

తాంసి: భీంపూర్ మండలంలోని పలు గ్రామాల ప్రజలు బుధవారం రాత్రి అంధకారంలో ఉన్నారు. ఈదురుగాలులతో కురిసిన వర్షానికి ఆదిలాబాద్ రూరల్ మండలం జందాపూర్ సమీపంలోని పంటచేనులో 33 కేవీ విద్యుత్ స్తంభం విరిగి నేలకొరగడంతో నిపాని, అర్లి(టి) సబ్‌స్టేషన్లకు విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో మండలంలోని భీంపూర్, వడూర్, ధనోర, నిపాని, అర్లి, గోన, కరంజి(టి), గుబిడి, వడ్గాం, తాంసి(కె), గొల్లఘాట్ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గురువారం ఉదయం ఏఈ శ్రావణ్ కుమార్ సిబ్బందితో కలిసి మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.



జందాపూర్ వద్ద విరిగిపడిన విద్యుత్ స్తంభం

మహిళపై దురుసుగా ప్రవర్తించిన సెక్యూరిటీగార్డ్లు

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బంధువును పరామర్శించేందుకు వచ్చిన నేరడిగొండ మండలానికి చెందిన ఓ మహిళపై రిమ్స్ సెక్యూరిటీగార్డు దురుసుగా ప్రవర్తించినట్లు బాధితురాలు పేర్కొంది. తాను లోనికి వెళ్లేందుకు ప్రయత్నించగా చేయిపట్టి నెట్టివేశాడని తెలిపింది. ఇదే విషయమై తన బంధువు ఎందుకిలా ప్రవర్తించావని ప్రశ్నించగా అతనిపై నలుగురు సెక్యూరిటీగార్డులు దాడి చేసినట్లుగా బాధిత మహిళ పేర్కొంది. దీంతో కొద్దిసేపు రిమ్స్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అక్కడి నుంచి రిమ్స్ సెక్యూరిటీగార్డులతో పాటు బాధిత మహిళ, కుటుంబసభ్యులు పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడ కూడా వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కాగా సెక్యూరిటీగార్డును మహిళ బంధువు చొక్కా కాలర్ పట్టుకున్నారని, తాము ఎవరినీ నెట్టివేయలేదని, ఎలాంటి దాడి చేయలేదని వారు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్, డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేశ్ అక్కడికి చేరుకుని వారికి నచ్చజెప్పి పంపించేశారు.

కత్తితో దాడి..ముగ్గురికి గాయాలు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలో పండుగ పూట కత్తులతో యువకులు ఘర్షణకు దిగడం కలకలం రేపింది. చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కొందరు యువకుల మధ్య వ్యాపార డబ్బుల విషయంలో వాగ్వాదం జరిగి గొడవకు దారి తీసినట్లు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపారు. గురువారం సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో పట్టణంలోని కోలిపూర పాఠశాల సమీపంలో ఐదుగురు యువకుల మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. కోలిపూరకు చెందిన అన్నదమ్ములు సయ్యద్ ముజాయిద్, సయ్యద్ షాహిద్ అక్కడి నుంచి టీ తాగేందుకు ఓల్డ్ బస్టాండ్‌కు వచ్చారు. గొడవను మదిలో పెట్టుకున్న మరో యువకుడు ఫజ్లు వెంట కత్తి తెచ్చుకున్నాడు. ఆ అన్నదమ్ముల వద్దకు చేరుకుని మరోసారి వారితో గొడవకు దిగాడు. వెంట తెచ్చుకున్న కత్తితో వారిపై దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో ముజాయిద్‌కు కడుపు భాగం, చెయ్యికి గాయాలయ్యాయి. అడ్డువచ్చిన తమ్ముడికి సైతం స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు బాధితులను రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ముజాయిద్‌కు వైద్యులు చిన్నపాటి శస్త్ర చికిత్స చేశారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ రిమ్స్‌కు వెళ్లి వివరాలు సేకరించారు. అయితే యువకుల మధ్య జరిగిన గొడవకు పూర్తి కారణాలు తెలియరాలేదు.



గాయాల పాలైన సయ్యద్ ముజాయిద్

కొబ్బరి నీళ్లకు డిమాండ్

- ఆరోగ్యానికి సైతం అన్నివిధాలా మేలు
- కొనుగోలుకు ప్రజల ఆసక్తి

నిర్మల్‌ఖిల్లా: వేసవికాలంలో మండుతున్న ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు కొబ్బరి బోండాలు తాగేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో జిల్లాలో కొబ్బరిబోండాల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. మన రాష్ట్రంలో కొబ్బరి తోటల సాగు తక్కువగా ఉండడంతో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ తదితర రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్నాయి. ప్రతిరోజు ఉదయం తెల్లవారుజామునే లారీల్లో జిల్లా కేంద్రానికి కొబ్బరి బొండాల లోడు చేరుకుంటుండగా, అక్కడి నుండి విక్రయదారులు టోకున కొనుగోలు చేసి రోజంతా రిటైల్ అమ్మకాలు సాగిస్తున్నారు. ఒక్కో లారీలో దాదాపు 7వేల వరకు కొబ్బరి బొండాలను తరలిస్తున్నారని, వాటిని కొనుగోలు చేసి తమ దుకాణాల్లో అమ్ముతున్నట్లు విక్రయదారు వెంకటేశ్వర్లు 'సాక్షి'తో తెలిపారు.

ఒక్కో బోండాం రూ.40

జిల్లా కేంద్రంలో కొబ్బరి బొండాల ధరలు కూడా గతంలో కంటే ప్రస్తుతం పెరిగాయి. గతంలో ఒక్కో కొబ్బరిబోండాం రూ.25 నుంచి రూ.30 చొప్పున అమ్మేవారు. ప్రస్తుతం రూ.40 నుంచి రూ.50 వరకు ధర పలుకుతోంది. అదే కొబ్బరి నీరు ఒక లీటర్ బాటిల్ కొనాలంటే రూ.150 అవుతుంది. ఇతర శీతల పానీయాల కంటే స్వచ్ఛమైన కొబ్బరినీరు తాగడం ఆరోగ్యానికి మంచిదని భావించి ప్రజలు కొబ్బరి బొండాలు సేవించడానికి ఇష్టపడుతున్నారు. అనారోగ్యం పాలైన వ్యక్తులు, హాస్పిటల్లో ఇన్ పేషెంట్లుగా జాయిన్ అయినవారు కూడా కొబ్బరి బోండాలను సేవింప చేస్తున్నారు. దీంతో కొబ్బరి బొండాలకు డిమాండ్ గణనీయంగా పెరుగుతోంది.



జిల్లా కేంద్రంలోని ఓ కొబ్బరిబోండాల దుకాణం

ఆరోగ్యానికి మేలు



కొబ్బరి బోండాం సేవించడం వల్ల ఆరోగ్యానికి అనేక విధాలుగా ప్రయోజనం చేకూరుతుంది. శరీరానికి అవసరమైన పొటాషియం, సోడియం, మెగ్నీషియం పుష్కలంగా అందుతాయి. ఖనిజ లవణాలు లభించడంతో పాటు శరీరానికి నీరసం, అలసటను దూరం చేస్తుంది. తక్షణ శక్తిని అందజేస్తుంది. డీహైడ్రేషన్ పరిస్థితిని నియంత్రిస్తుంది. మూత్రపిండాల వ్యవస్థను కూడా మెరుగుపరుస్తుంది. ఎండలో తిరిగి వాంతులు, విరోచనాలు అయినప్పుడు కొబ్బరి బోండాలతో ఉపశమనం పొందవచ్చు.

– డాక్టర్ ఎస్.శశికాంత్, ల్యాప్రోస్కోపిక్ సర్జన్, నిర్మల్

అలసట దూరమై శరీరానికి శక్తినిస్తుంది



నేను వృత్తిరీత్యా ప్రతీరోజు ఎండలో తిరగాల్సి ఉంటుంది. ఎండనుంచి ఉపశమనం పొందేందుకు వారంలో రెండు మూడుసార్లు కొబ్బరిబోండాలను తాగుతా. దీనివల్ల ఆరోగ్యం కూడా బాగుంటుందని డాక్టర్లు చెప్పారు. అలసట దూరమై శరీరానికి శక్తినిస్తుంది. కొబ్బరినీరు తాగడం అలవాటుగా మారింది.

– రాజు, వినియోగదారుడు, నిర్మల్

రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలి

ఇచ్చోడ: సర్కారు దవాఖానాకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. గురువారం ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. ఆస్పత్రికి వచ్చే గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. రోగులకు అందించే వైద్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాత్రివేళలో వచ్చే రోగుల పట్ల వెంటనే స్పందించాలన్నారు. ఆరోగ్య కేంద్రాల ద్వారా 24 గంటల పాటు వైద్యం అందించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

సర్సాపూర్(జి): రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన మండలంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల మేరకు సర్సాపూర్ (జి) మండల కేంద్రానికి చెందిన తమ్మరాశి భూమన్న బుధవారం ద్విచక్ర వాహనంపై లోకేశ్వరం మండలం హవర్గా గ్రామానికి వెళ్లి వస్తుండగా అర్లి(కే)సమీపంలో కంకెట గ్రామానికి చెందిన సుధీర్ కుమార్ ద్విచక్ర వాహనంతో ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. భూమన్న సోదరుడు ఆంజనేయులు ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసుకుని విచారణ చేపడుతున్నట్లు ఎస్సై హన్మండ్లు తెలిపారు.

అటవీ ఫలాలపై ఆసక్తి



పాలపండ్లు విక్రయిస్తున్న మహిళ

నెన్నెల: వేసవి వచ్చిందంటే చాలు పలు రకాల అటవీ పండ్లు దర్శనమిస్తుంటాయి. అడవిలో సహజంగా దొరికే అటవీ ఉత్పత్తులను గిరిజనులు గ్రామాల్లో విక్రయించి కొత్త రుచిని చూపిస్తుంటారు. సీజన్‌లో లభ్యమయ్యే అటవీ ఫలాలను ఏటా తింటే ఆరోగ్యానికి మంచిదని పల్లె ప్రజల నమ్మకం. అందుకే ప్రతి ఒక్కరూ అటవీ ఫలాలను తీసుకోవడంపై ఆసక్తి చూపుతుంటారు. పాల పండ్లు, తునికి పండ్లు, మొర్రి పండ్లు తదితర వాటిని గిరిజనులు అడవి నుంచి సేకరించి గ్రామాల్లోకి తీసుకువస్తుంటారు. దీంతో గిరిజనులకు ఈ వేసవి ఉపాధి ఇచ్చినట్లు అవుతుంది. ఏడాదికి ఒకసారి మాత్రమే వేసవిలో కనిపించే ఈ పండ్లను కొనుగోలు చేసేందుకు ప్రతి ఒక్కరూ ఇష్టపడుతారు. అరుదుగా కనిపిస్తున్న పాలపండ్లకు ఎక్కువ ధర ఉన్నప్పటికీ, కొనడానికి ప్రజలు వెనుకాడటం లేదు. ఈ రెండు నెలలు గిరిజనులు అడవిలో సంచరించి వీటిని సేకరిస్తుంటారు. దీంతో రెండు నెలల పాటు గిరిజనులకు ఉపాధి దొరుకుతుంది. దీంతో పాటు ఇదే సీజన్‌లో ఇప్పపూల సేకరణ సైతం చేస్తూ ఉంటారు.

నగదు పట్టివేత

తలమడుగు(బోథ్): మండలంలోని లక్ష్మీపూర్ చెక్‌పోస్టు వద్ద గురువారం నిర్వహించిన తనిఖీల్లో రూ.90 వేల నగదు పట్టుకున్నట్లు ఎస్సై ధనశ్రీ తెలిపారు. కిన్వట్ నుంచి ఆదిలాబాద్‌కు వస్తున్న మారుతి షిఫ్ట్ కారును తనిఖీ చేయగా అందులో ప్రయాణిస్తున్న గంగాధర్ సీతారాం వద్ద రూ.90 వేల నగదు లభ్యమయ్యాయి. వాటికి సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపించకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్సై సురేందర్, రెవెన్యూ సిబ్బంది రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

బేల: మండలంలోని శంకర్‌గూడ గ్రామ శివారులోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులో గురువారం నిర్వహించిన తనిఖీలో రూ.లక్ష నగదు పట్టుకున్నట్లు ఎస్సై రాధిక తెలిపారు. వైభవ్ అనే వ్యాపారి మహారాష్ట్రలోని కోర్పణ నుంచి పటాన్‌బోరికి కారులో రూ.లక్ష తరలిస్తుండగా పట్టుకున్నారు. సరైన పత్రాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసి ఎఫ్ఎస్‌టీ టీంకు అప్పగించినట్లు వారు పేర్కొన్నారు.



పట్టుకున్న నగదుతో పోలీసులు

కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య

జన్నారం: కడుపునొప్పి భరించలేక పురుగుల మందు మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై మృత్యుంజయ సర్కార్, మృతురాలి తల్లి గంగమ్మ తెలిపిన వివరాల ప్రకారం బోథ్ మండలం కరత్వాడ గ్రామానికి చెందిన ఈదుల్ల గంగమ్మ, అడెల్లు దంపతుల కుమార్తె నవ్య (28)కు జన్నారం మండలం మురిమడుగు గ్రామానికి చెందిన గద్దల శ్రీనివాస్‌తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. దంపతులకు ఇద్దరు సంతానం. ఉట్నూర్ ఆర్డీవో కార్యాలయంలో ఎస్‌వోగా పనిచేస్తున్న నవ్య కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా నయంకాలేదు. ఈ నెల 10న కడుపునొప్పి తీవ్రం కావడంతో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు ముందుగా జన్నారం, అక్కడి నుంచి మంచిర్యాల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.